# పైపెచ్చుట, తప్పు మాదిట!

శ్రీ భమిడిపాటి కామేశ్వరరావు

ఒకనాడు రాగయ్య మేం వతనగా కలుసుగుంటూండే చోటికి కాళ్లీడుచుగుంటూ కళేబరం జేరేసి బస్తాలాగ ఓకుర్చీలో కూలబడి ఉసూరుమంటూ ఈ కిందిమోస్తరుగా ఏకరెట్టడం ప్రారంభించాడు. అప్పుడప్పుడు మేం ఏదేనా ప్రశ్న వెయ్యడంలో నెగ్గినా, అతడు తను మాట్టాడుతూనే అది వినేసే వాడుగాని, సాధారణంగా ఆగి వినేవాడు కాడు. అందుకని రమారమీ అవిచ్ఛిన్నంగా ఉన్న అతని ఉపన్యాసం మేం, రైల్లో మందుల ఏజంటు అప్పగించే ఉపన్యాసంలాగ, శబ్దగ్రాహిలో ప్రతిఫలించే ఛాయోపన్యాసం లాగ, సశబ్ద చిత్రంలో ఉద్భవించే అఖండ గానంలాగ,ఆపెయ్యడానికి వీలులేని అవస్థలో వినవలిసొచ్చింది:

"పైపెచ్చుట, తప్పు మాదిట! సెబాసు. సిగ్గుఉండద్దూ! ఎవడేనా నవ్విపోడూ! తనజాతి ఛనియాలజాతి, చేష్టలు కోతిచేష్టలు, బుద్ధి కుక్కబుద్ధి, నడక సీతనడక. ఉన్న సౌభాగ్యం ఇదీ, దీనికి సాయం వేళా పాళా లేకుండా శ్రీరంగనీతులు. వీడిభార్య! — బాబో, అసలు మాట్టాడలేం. వీళ్ల నేరాలు జాస్తీ అయినకొద్దీ వీళ్ల సబబులుకూడా జోరుచేశారు. వీళ్ల పెడసరం బండలుగానూ! వీళ్లు ఎవరికో నాబోటి మేకలాంటివాడికి ఘోరాన్యాయం చెయ్యడం, వాడు ఎందు కొచ్చిందని సాత్వికంగా నోరు నొక్కుగుని ఊరుకోడం,అయినా ద్రోహబుద్ధి పీడించడంచేత వీళ్లు ఊరుకోలేకపోడం, అక్కణ్ణించి ఆసాత్వికుడికి తమరు జరిపిన ద్రోహమే ఆసాత్వికుడువల్ల తమకి జరిగిందని వీళ్లు ఏడుస్తూ ఎదురు తిరిగి, అట్టు తిరగేసి, నోరుచేసుగుని, అమ్మశక్తుల్లాగ వాడిమీదా వినేవాళ్లమీదా విజృంభించడం! అప్పుడు మధ్యవర్తులంతా అవతలవాడు సాత్వికుడుల్లా కనబడుతున్నాడేగాని వాడే ద్రోహి అనుకోడం, నిజంగా బాధపడ్డది వీళ్లే అనుకోడం. సత్యం ఏదో అసత్యం ఏదో తెలియకుండా పూతపూసి వీళ్లు ఊరుకుంటున్నారా, సత్యమే అసత్యంఅని జనం నమ్మేట్టుగోలెత్తడం, అసత్యానికి సత్యగౌరవం తెప్పించి నెగ్గడం. ఏక చెండ్రుకోడం, ఏక ఎద్దేవా! చెబితే గర్వం అని ఏడుస్తారుగాని, నేనంటే, మాయింట్లోవాళ్లంటే, మేం అంతా ఎంత సాత్వికులం! దిక్కుమాలి నక్కలాళ్లంతా వచ్చి నన్ను పేట్రేగకొట్టకపోతే, నాకు కోసినా — చాకు మాయిష్టం వచ్చింది తెండి పదునెట్టి — కోపం ఉందా! ఇంకోడి జోలి నాకు కావాలా! వీళ్లకి మరీ వచ్చింది! నా అద్దెవాటాలో నేను చేరడానికి చాలా పూర్వమే తను అవతల పక్కవాటాలో శని లాగ పోగై కూచుని, తనమీదికి నేను శనిలా వచ్చానంటాడు, వీడిదుంపతెగా! నేను ఇల్లా నావాటాలో దిగీ దిగకుండానే నాతో జట్టీ! మాతో పోటీ ఎందుకండీ వీళ్లకి! అడిగేవాడు లేకగానీ! మళ్లీ వీళ్లు ఎల్లాంటి సమర్థింపులనుకున్నారు, మహా ఋషులకేనా ఇంతంత

మాటలు చెల్లవ్! నాకు ఉద్యోగం లేదని వీళ్లు ఎంత ఏడుపో! నాకు ఉద్యోగం కాలేదంటూ నే వీళ్లు ఇంత ఏడిచేటప్పుడు, నాకే ఉద్యోగం అయితే వీళ్లు బతుకుతారా! అబ్బబ్బ! వొళ్ళుగు తినేస్తున్నారు. వేగలేకండా ఉన్నాం. అమ్మయ్య! ముగుడే ముగుడు, పెళ్లామే పెళ్లాం! పేళ్లతో సహా వీళ్లని ఎల్లా కూర్చి సంపుటీచేశాడోగాని ఆబ్రహ్మ!"

ప్రశ్న — ఎవరిమాటా ను వ్వనేదీ!

రా — ఏట్లో వాళ్ల మాట! ఎవ రున్నారూ, మా పొరుగువాటాలో అద్దెకుంటూన్న పీనుగులు!

ప్ర — పేర్లు!

రా — వాడిపేరు గుండయ్య. భార్య మిరియమ్మ.

ప్ర — ఓహో! ఉమ్మడిస్థలం గురించిన కుస్తీలా? ఆ మిరియమ్మా మీ కూచమ్మగారూ పట్టింపులుపోతూంటారు గావును!

రా — అంతటితో కుదిరిందా! హాలూ దొడ్డీ ఉమ్మడి. నావాటా తూర్పుది, వాడిపాటా పడమటిది. మధ్యహాలులో చెరిసహానికి గీత గీసుకున్నాం. కాని, ఆచచ్చినాడు రాత్రిమమ్మల్ని కునకనిచ్చి ఆ గీత మావాటాకేసి జరిపేస్తూంటాడు. కానీ, వాడిగీత ప్రకారం వాడికి అవుతుందని ఊరుకుంటిని గదా, ఊరుకుంటూన్న కొద్దీ వాడికి నోరెగిసిపోతోంది, పోటీ బిగిసిపోతోంది.

ప్రశ్న — అసలు కమామీషు ఏమిటి?

రా — అసలా? వాళ్లు గొప్పవాళ్లనీ, మేం అల్పులంఅనీ; వాళ్లు ఉద్యోగులనీ, మేం కాదనీ! వాళ్లు డబ్బున్నవాళ్లనీ మేం లేనివాళ్లంఅనీ! ఏముందీ! గుండయ్యకి కొడుకు ఓడున్నాడు. వాడు అచ్ఛంగా బూడిదిగుమ్మిడికాయిలా ఉంటాడు. మొహం కొండముచ్చు మొహం, ముక్కు చిచ్చుబుడ్డి. అంతోటి కుమారస్వామీ తమరికి ఉన్నాట్టా, మాకు లేట్టా, అందుకని నేనూ మాఆవిడా ఉడికిపోయి, వెళ్లి, మాచెల్లెలిగారి అబ్బాయిని తెచ్చుగున్నాంట తమరిమీద పోటీకోసం! ఈ మాట పట్టుగుని మమ్మల్ని అడ్డమైన వాళ్ల దగ్గిరా నిరసన! వాళ్లొచ్చి నాతో చెప్పరనే గావును ఈబోడిగాడి ఉద్దేశం!

ప్ర — మీరు అక్కడికి వెళ్లింతరవాతే, వాళ్లకి పిల్లాడున్నాడు అని తెలిసింతరవాతే, ఒకపిల్లాణ్ణి మీరుకూడా తీసి తెచ్చుగున్నారు గావును!

రా — సడె! మేం మా చెల్లాయిగారి అబ్బాయిని అనేకమాట్లు, ఈగుండయ్యకి కొడుకుకుంక పుట్టకపూర్వమే ఆపేక్షకొద్దీ తీసితెచ్చుగునే వాళ్లం. నీచులికిగాని పోటీ మాకెందుకు ఉంటుందీ! గుండయ్య అంతటితో ఊరుకోవచ్చా, తన కుర్రవెధవకి తోపుడుబండీ ఓటి కొన్నాడు. కొన్న మూడోనాడు, మాఆవిడ, — చెడీ బతిగావా బతిగిచెడ్డావా అన్నట్టు, స్వతహా అయినింటిబిడ్డగనక — నాతో: "తీరా మనం పిల్లవాణ్ణి ఓణ్ణి తీసి తెచ్చినవాళ్లం అవనేఅయాంగదా! ఊళ్లోవాళ్ల కుర్రవెధవ లందరికీ తోపుడు బళ్లు ఊరేగుతూన్నప్పుడు మనం అంత చెడిపోయామా, అంతకీ చాలమా, అంతా చెయ్యమా? పాడురకాలకిగాని మనబోటిగాళ్లకి పోటీబుద్ధి ఎందు కుంటుందిగనక! మనం తీసికట్టు అని ఋజువుచెయ్యడానికేట వాళ్లు బండీ కొన్నది! ఈపిల్లాడికిమాత్రం బండీమీద

మక్కువ ఉండనేడుండదా, కుర్రనాగమ్మ విప్పి చెప్పుకోలేదుగాని! మీరుకూడా వీడికి ఓటి అల్లాంటిదే కొని గౌరవం నిలబెట్టండి" అని సన్నసన్నంగా సమంజసంగా నాభార్య చెబుతూంటే ఆవిడమాట వినకపోడం అనేది మహాపాతకం అనిపించింది. కాని, బులబాటం చల్లారింతరవాత, తీరా బండీమీది వ్యామోహం రెండుపూటల్లో గతిస్తే, కొన్నబండీ మళ్లీ ఏం జేసుగోం? అని, నేను ఆలోచించుగుని, ఓబండీ 'టెంపొరీ'గా తెత్తాంగదా అని మర్నాడు చీకటడ్డతరవాత ఓవడ్లాబత్తుడింటికెళ్లి, అక్కడికి మరమ్మతునిమిత్తం వచ్చిన ఓ బండీ చూసి, బదులుచేసి తెచ్చిన ఓపావలా వాడిచేతిలో పడేసి, మర్నాడు సాయంత్రానికి అది మళ్లీ అప్పగించేసే షరతుకి ఇంటికి తోసిగల్లాను. పొద్దున్నే మాపిల్లాణ్ణి అందులో కూచోపెట్టి ఇంకా మావాటాలోనే ఇటూ అటూ తిప్పుతూంటేనూ, గుండయ్యగాడు పిరికిపందలాగ వెనకాలే — వీడికాళ్లు పడిపోనూ — వచ్చి, — వీడివేళ్లు అంటించా —అంటుగునేట్టు ఒక్కచరుపు నన్ను చరిచి, పిల్లాణ్ణి కింద పడగొట్టి, బండీ లాక్కు చక్కాపోయాడు. అల్లరవుతుందని అప్పట్లో వాణ్ణి నేను కొట్టలేదు. న్యాయతహా చెప్పుచ్చుగు కొట్టవలిసింది. ఇహ వడ్లాబత్తుడితో ఏం చెప్పనురా బాబూ అనుకుంటూ వాడిదగ్గిరకెళ్లేసరికి ఆరాలుగాయిళనిగాడు సీలుగుతూ, 'సిత్తం. అది గుండయ్యగారిదేనండి. మరమ్మతుకోసం అంపారు' అన్నాడు!! ...ఇది గుండయ్యపనే అయి ఉంటుంది, వీడికొమ్ములు ఎల్లా కొట్టెయ్యడమా, నేను తనంతవాణ్ణే అని వీడికి పాఠం చెప్పడం ఎల్లానా, నాగౌరవం నిలుపుగోడం ఎల్లానా అని నాకు అనిపిస్తూ ఉండేది.

ఎల్లానో పోనీ అయింది దిగమింగి సరిపెట్టుగుందాం అని యత్నిస్తూండగానే, మిరియమ్మ ఓచీర కొంది. అందులో విశేషం ఏమీలేదు. దానికి అంచుమాత్రం పచ్చగా నదరగా ఉంది. ఆ చీర సింగారించుగుని, మెడ టెక్కించడం, తాళప్రకారం నడుస్తూన్నట్టు నడవడం, ఒయ్యారం ఒలక పొయ్యడం, ఉమ్మడిహాల్లోకి రావడం, మాఆవిణ్ణి వచ్చి కూచోమనడం, అర్థం లేని కబుర్లెట్టడం! ఎందుకూ! మహా అక్కడికి చీరకొందికాదూ ఎల్లాగైతేం, వెధవచీరా! — నోరు తిన్నగారాదు నాకు ఏమనుకున్నారోగాని — ఆ సింగారంఅంతా ప్రకటించుగోడానికి! ఆమాత్రం మేం కొనుక్కోలేంఅనే దాని ఊహ! మాఆవిడ మిరియమ్మగర్వం చూసి క్షమించి కిమ్మనకుండా ఊరుకుంది. ఇంకొత్తి అయితే అచ్చంగా అల్లాంటిచీర నుంచున్నపాట్న తెస్తావా కంఠానికి ఉరోసుగోమన్నావా అని ముగుణ్ణి అంపాన్నిబట్టి రాసేసేదే. కాని, మావాళ్లు అల్లా చెయ్యక, రెండోవాళ్లకి బాధలేకుండా, అన్నంమాత్రం మానేసి బొట్టు చెరిపేసుగుని అతిశ్రావ్యంగా లయయుక్తంగా రాగాలు పెట్టారు. ఇలాగంటియిల్లాలి కంటినీరు కారితే సముద్రాలు ఏకం అవుతాయని భయంవేసి, చటుక్కున నాఉంగరం తాకట్టెట్టి రాత్రికి రాత్రి వెళ్లి నేనూ అల్లాంటిచీరి గాలించి పట్టుగుని తెచ్చి మా ఆవిడి కిచ్చి, అదిఆవిడ ధరించి తూర్పు తెల్లారకుండా ఉమ్మడిహాల్లో ఎత్తుపీట వేసుగుని కూర్చుని, మిరియమ్మని పిలిచి ఆవిడతో సోదివేస్తే, అప్పుడు మిరియమ్మకి మాతక్కువ ఏముందో తన ఎక్కువ ఏం చచ్చిందో బోధపడి సిగ్గురావచ్చు గనుక, అల్లా కానిమ్మని మా ఆవిడతో చెప్పాను.

కాని, ఉదయాన్నే నన్ను లేవగొట్టి మాఆవిడ దుఃఖించడం మొదలెట్టింది. ఏమంటే నే తెచ్చినచీర అంచుకంటె మిరియమ్మ చీర అంచు, రంగులో, ఒత్తుగా ఉందట. నిజమే అయిఉంటుంది. రాత్రి నాకు ఆనదు. ఇంతే గదా అనేసి ఆలస్యంకానీకుండా నిలువు కాళ్లమీద పచ్చసిరా తీసి తెచ్చి మాచీర అంచుమీద ఓ'కోటింగు' వేశాం. దాంతోటి మిరియమ్మజలుబు వదిలిపోయిం దను కున్నాం. కాని, మిరియమ్మ మర్నాడు ఓ యాభై వ్యేట్టి బనాత్ చీర కొంది. మాఆవిడ తక్షణం తనకి గౌరవహాని కలగడం కనిపెట్టి, వెఱ్ఱిబాగుల్ది గనక ఎంతోంత చిన్నబుచ్చు గుని, తన పాతనాగరమూ పట్టిడా కరిగించి సొమ్ము తెప్పించి, అదెట్టి శుద్ధబనాత్ కొని, మిరియమ్మకంటె ముందు కట్టేసుగుని ఉమ్మడి హాల్లో కూచుంది.

ప్రశ్న— కొంత పోటీభావం మీలో లేదంటావా ?

రా— ఏడిసినట్లే ఉంది. ఇదా నీతీర్పు! అసలువాళ్లు ఎప్పుడు ఏం పనిచేసినా తమరి నిమిత్తం కాదు, పక్కనున్న మాదరిద్రం, మా అల్పత్వం, మా అధమత్వం, మా అజ్ఞానం వెల్లడి చెయ్యడానికే అని మాకు తెలుసు. వాళ్ల "నవిజం" మీకేం తెలుసూ! నాకు నీ లక్ష్యంగాని, గుండయ్య లక్ష్యంగాని, మరో మెడమీద తలఉన్న వాడిలక్ష్యంగాని లేదు. నా గౌరవానికి భంగం వస్తూన్నప్పుడు నాకు అన్నం వడ్డించేవాణ్ణయినాసరే పోడి చేస్తాను. అవసరాన్ని బట్టి నేను దేవుణ్ణి కుడా లక్ష్యం చెయ్యను. సమయం వచ్చే సరికి అసలు నా అంత తల్లకిందులు ముండావాడు ఉండబోడు. ఇంతలో గుండయ్యగాడు ఓకుక్కపిల్లని కొన్నాడు. 'దొంగభయం దొట్రభయం ఉండదు. భైరవం అవతారాల్లో చేరుతుం దన్నారు. ఓకుక్కపిల్ల ఉండడం మనికి మంచిది' అని నా అర్ధాంగి నాకు అప్పటికి పదిరోజుల క్రితం నించీ సకారణంగా నూరిపోస్తూంటే వాడె ప్పుడో వినేసి చేసినపనే అది. మా ఆవిడ మాటల్లో ఉండే యాధార్థ్యం మరితో సెయ్య లేక, మర్నాడు నేను కుంభయ్యగారి కుక్క పిల్లని ఓ మాటు అరువిమ్మని అడిగి, గొలుసు పళంగా తీసుగొచ్చి, మా స్తంభానికి ఇల్లా కట్టేస్తూంటే, ఆ కుక్కపిల్లకి ఏం అను మానం తగిలిందో, లటక్ మని నాకాలు పట్టుకుంది. 'బాబో, రావే రావే' అని మా యింట్లోవాళ్లని ధైర్యంకోసం కేకేశాను. గుండయ్యకుంక ఇంట్లో లేడు. వాడి కుక్క పిల్ల ఏమనుకుందో దానితాడు తెంపు గుని వచ్చి నే తెచ్చిన కుక్కపిల్ల మీద పడబోయి- అది తప్పించుకోగా- నా రొండో కాలు వడేసి పట్టుగుంది. ఇంట్లో మూల జేరేసి ఉన్న మన్యపుకర్ర తెచ్చి మా ఆవిడ ఉమ్మ డిగా, దంచి తిరగేసింది. నాకాలికి కొంచెం దెబ్బ తగిలినా నేను లెక్కచెయ్యలేదుగాని, కుంభయ్యకుక్కపిల్ల కుయ్యో మొర్రో మని మొరుగుతూ గిరగిరా తిరిగి పడుకుంది. గుం డయ్యకుక్కపిల్ల దెబ్బ తగిల్నట్టే లేదు. అప్పుడు నేను లోపలి కెళ్లి చేంతాడు తెచ్చి దాన్ని కాళ్లమీద ప్రాణావశిష్టంగా ఉతికి మళ్లీ మా వాటాలో అడుగుపెట్టడానికి వీల్లే కుండా ఏర్పాటు చేసేశాను. మిరియమ్మ ఏడుచుగుంటూ ఇదంతా గుండయ్యతో చెప్పుగుంది.

ప్రశ్న — కుంభయ్య తన కుక్కపిల్ల కోసం పేచీ పెట్టలేదూ?

రా— ఎందుకూ! అది చావందే! ఊరికే పడింది. గంజోసి లేవదీశాం. అక్కణ్ణించి గుండయ్యమొహం చూడకూడదు అన్నంత అసహ్యం నాకూ మా ఆవిడికీ కూడా పట్టుకుంది. అదిలగాయతు, నిద్రాహారాలు మానుకుని, ఆ వెధవ ఏ కొత్తవస్తువు ఇంటోకి తెచ్చుగుని బడాయి కొడుతూనో కొట్టకుండానో ప్రకటిస్తూంటే మూడు మూర్తులా అల్లాంటిదే నేనూ తక్షణమే తల తాకట్టెట్టయినా సరే తెచ్చి నాయింట్లో పడేసి, "ఏమిట్రా నీ గొప్ప! ఎవడికి భయంరా ఇక్కడ! నేను తక్కువ తిన్నానుట్రా! చూస్కోరా!" అని నేననుకుంటున్నానని వాడికి బోధపడేటట్టు చేసేవాణ్ణి. మిరియమ్మ చెవలికి గరిగమ్మల్లాంటి లోలకులు చెయించింది. మేమూ చెయించాం. ఆవిడకాళ్లకి చక్కిలాలు చెయించింది. మేమూ చెయించాం. ఆవిడ వెండిగ్లాసు కొంది, మేం మా పల్లెటూరిలో స్థలం అమ్మేశాం— లేకపోతే వీళ్ల పొగరు అణిగి ప్రపంచం బాగుపడేట్టు కనపడలేదు. ఆ డబ్బొచ్చింది. మేమూ వెండిగ్లాసు కొన్నాం— అల్లాంటి పలకల వెండిగ్లాసే. ఆవిడ పోటీ కోసం ఇరవైకాసు లెట్టి ఒడ్డాణం చెయించింది. మేం రహస్యంగా గిలుటుది కొన్నాం. ఆవిడ గంగాళం కొంది. మేమూ కొన్నాం. ఆవిడదాసీదానికి కుడికన్ను గుడ్డి. కుడికన్ను అల్లానే ఉన్నవాళ్లు ఆ ఊళ్లో దొరక్క మేమూ దాన్నే పెట్టుగున్నాం. గుండయ్యగాడు ఫిడేలుకొని మొదలెట్టాడు. నేనూ కొని వాయించడం మొదలెట్టగానే అది వినడానికి వాడికి చెవుల్లేక తను వాయించడమే మానేశాడు. వాడు లెక్చరు ఇచ్చాడు. నేనూ లెక్చరు ఇచ్చినట్టు ఒకవిలేఖరికి రెండు రూపాయిలిచ్చి పత్రికలో వెయించాను. వాడు పుస్తకం చేశాడు. నేను ఓడిచేత రాయించి వాడికి అయిదు రూపాయిలిచ్చి, నాకర్తృత్వం దానికి పెట్టించాను.

కాని, కొనడానికి వీల్లేని వస్తువులు కొన్ని కొన్ని వాడికి సంక్రమిస్తూ ఉండేవి. నేను ఒకటోరకమైన ప్రజ్ఞగలవాణ్ణి గనక ఒక్కొక్క పసిస్ుట్టే దాటేవాణ్ణి. వాడికి ఉద్యోగం ఉంది లెండి. వాడల్లా అనుకుంటున్నాడుగాని, వాడి ఉద్యోగమూ నా దగ్గిరున్న గుడ్డి వ్వా సమానం! ఓ నాడు వాడి అధికారిగారి రొండుగుర్రాల 'సారటు' ముప్పెత్తి దానిమీద తనింటికి వచ్చి వాడు దిగడం నాకు తెలిసింది. తనంతటి ఉత్తములాలికి జీవితేశ్వరుణ్ణి అయిన నేనుకుడా అల్లా రావడం చూసినప్పుడు గాని తనకళ్లు చల్లగా ఉండవని మా యింట్లోది ప్రతిజ్ఞ పట్టింది. ఊళ్లో అల్లాంటి 'కోచి' మరోటి లేదు. పోనీ రెండు విడిగుర్రాల్ని మాట్లాడి, వాట్లమీద ఓ చెక్క పడేసి, దానిమీద వచ్చి, మా యింటియెదుట దిగెయ్యచ్చు, ఎవడేనా ఇదేమిటని నవ్వితే, ఓరికుంకా, రెండు గుర్రాల బళ్లు అనేకరకాలురా, అని బుకాయించచ్చు, అనుకుంటే, అంత సమానడక గుర్రాలు దొరకవండి, ఏమాత్రం విషమంగా నడిచినా చిక్కు, అని గుర్రాలవాళ్లన్నారు. అందుకని, ఆ అధికారింటికే దొడ్డిదార్ని నేనూ వెళ్లి, ఆబండితోలేవాడి చేతిలో ఓపాత బేడ పెట్టి, ఆబండి అధికారిగారికోసం వెళ్లేటప్పుడు మావీధిలోంచి పోనిమ్మని వాణ్ణి ఆజ్ఞా

పించాను. వాడు అల్లా చేశాడు గాని నన్ను వెనకాల ఉండే బల్లచెక్కమీద కూచో పెట్టాడు. అక్కణ్ణించే డిగాను. దొంగతనంగా కొందరు పిల్లలు బోలపడుకుని కొందరు కూచుని వెడుతూండే చోటుట అది. ఆపళంగా, మిరియమ్మ, ఒళ్లు తిప్పుగుంటూ చేతులు గిరవటేస్తూ, కళ్లు మిటగరిస్తూ, "అదేమిటే! మీ వారు అక్కణ్ణించి దిగారేమిటి?" అంటూ ఈసడించి మాట్లాడిందిట! మా ఆవిడ మళ్ళీ రాగా లెట్టి, తనముచ్చట్లన్నీ అల్లానే ముక్కలైపోతున్నాయని కుములిపోయింది. బండీతో లే వాడికి సన్నిహితంగా పృష్ఠభాగంలో కూచోడంకంటే వెనకాల హాయినుంటూ గాలేస్తూండేచోట కూచోడంలో నామర్దా లేదు పోదూ అని తెగేసి ఈ మాటు మిరియమ్మకి సమాధానం చెప్తే సరి అని మా ఆవిణ్ణి సమదాయించాను. ఏదో వోటి వస్తూనే ఉంది. గుండయ్యగాడికి విందు పిలుపు గురించి ఓ కార్డు వచ్చింది. నే యింటో లేను. అరుంధతిలాంటి రోషవంతురాలు గనక శిరచ్ఛేదం అయినట్టు అయి మా ఆవిడ నే రాగానే ఆమాట నాతో చెప్పింది. పిలిచినవారెవరో తెలియదాయిరి. అయినా మర్నాడు కొంచెం కాళ్లు అరిగేటట్టు తిరిగి, వయినం దొరక్క, ఇది పనికాదని చెప్పే హేసి, ఆ చీట్లు అచ్చుకొట్టిన ప్రెస్సు పట్టుగుని, అక్కడ అటువంటి చీటీ ఒకటి ఓకాఫీ ఖర్చు పారేసి సంపాదించి, దానిమీద నా పేరు నేనే ఎడంచేత్తో రాసుకుని పట్టిగెళ్లి నా భార్యకి చూపించి, ఆవిడయొక్క బాధ తొలగించి, ఆవిడకి ఆనందం కలిగించి, అది జేబులో పెట్టుగుని భోజనానికి వెళ్లి తరద్దీగా ఉన్నప్పుడు లోపల ప్రవేశించాను. గుండయ్య యత్నాలన్నీ మమ్మల్ని కొంచపరుద్దాం అనే. అందుకనే వాడికి తెగ సప్లయిలు అవుతాయి యింటికి. ఓమాటు ఓపల్లెటూర్నించి వాడికి గేద్దూడలాంటి పనస పండూనూ నిలువెత్తు తెల్ల చెక్కరకేళీ గెలానూ వచ్చాయిట. కాని, వాళ్ల పుణ్యమా అని, ఆ సమయానికి మిరియమ్మా వాళ్లూ ఎక్కడికో భోయినాని కెళ్లారట. చూస్తూ చూస్తూ అంతంత పసందైన ఫలాలు చెయిదాటపెట్టుగుంటే ఏంపాపం మెడకి చుట్టేసుగుంటుందో అని మాఆవిడ భయపడుతూ "ఎవరికి" అని పట్టుగొచ్చినవాణ్ణి అడిగిందిట. వాడు — గుండయ్య అన్లేకగావును — 'గున్నయ్య'గారికేనండి అని చీటీ ఇచ్చాడట. మాఆవిడ ఆచీటీ విప్పి చిరునవ్వుముఖంతో అది చదవడం అభినయించి, "మాకే! ఇక్కడికే! లోపల పెట్టు పట్టుగొచ్చి! ఆ పేరు మాయింటాయన చిన్నప్పటి ముద్దుపేరు!" అని వాడితో చెప్పి, అవియింట్లో పెట్టించి, వాడి కింత ఊరగాయి పడేసి ఇంత మజ్జిగ దాహంయిచ్చి, దెయ్యాల్లాగ మిరియమ్మా వాళ్లూ వచ్చిపడకుండా వాణ్ణి తరిమికొట్టేసిందిట. నేను వచ్చింతరవాత ఇదంతా మాఆవిడ నాతో చెప్పగానే, వాళ్లకి తెలిసినాకుడా తగాదా లేకుండా మాఆవిడ వ్యవహరించినందుకు నేను తెగ ఆనందించి, తెగనవ్వుకుని ఆవిడప్రజ్ఞ తెగపొగిడి, స్వజనవిషయం అయినా తప్పనిసరివల్ల చాలా మెచ్చుగున్నాను. ఒకనాడు ఈమధ్య నేను ఇటూ అటూ తిరిగి ఇంటి కొచ్చేసరికి మిరియమ్మ డొక్కుంటోంది. ఏమిటని కనుక్కుంటే వేవిళ్లు అని తేలింది. సరే. మరిఆఖరు. మనం ఆత్మగారవం నిలబెట్టుగోడానికి ఇంతబాధా పడుతూంటే వాళ్ల ఆధిక్యత ఖాయపడడానికి

దేవుడుకూడా సంకల్పించాడు కాబోలు అని నాకు దిగులు పట్టుకుంది. పిల్లాణ్ణంటే తెచ్చాం గాని, ఇ వెల్లా? నే నిల్లానే ఒకనాడు ఆలోచిస్తూ కూచునిఉండగా, మాఆవిడా డోక్కోడం మొదలెట్టింది. వెళ్లి చూస్తే రాగిచెంబుని చిలుం అరగతీసి నోట్లో పెట్టుగున్నా నంది. ఆ వేళకి మాఆవిణ్ణి అంతటితో ఆగమని, అది ప్రాణాపాయం అని ఆవిడతో చెప్పి మర్నాడు ఒక కాకి ఈక తెచ్చి అది గొంతికలో తిప్పుగుని డోక్కోడం అభినయించ మని ఆవిణ్ణి ప్రార్థించాను. ఆవిడ అల్లానే చేస్తోంది. వాళ్లిద్దరి రోగాలూ చప్పగా కుదిరాయి. కాని, గుండెలు బద్దలుచేసే పిడుగు పడ్డట్టు, గుండయ్యకి మూడువేలు లాటరీలో కొట్టుకొచ్చింది ఒక్కమాటుగా! మాఆవిడ మంచం పట్టి, “మనకి మాన ప్రాణాలు నిలవాలీ అంటే ఈమాటు లాటరీలో మీపేరు మోగాలీ” అంది. నేను తక్షణం లాటరీ అధికారుల్తో మాట్టాడాను. సొమ్ము అడక్కుండా ఉండి, ఆదివ్యయం నేను భరించేపరతుకి, లాటరీ నాకే వచ్చేటట్టుగా కార్యక్రమం నడపగలం అనివాళ్లు అన్నారు. ఆఖర్చు మొత్తం మొదట్లో 'వెయ్యి' అని అన్నా చివరకి అయిదు వందలు అని స్థిరపరిచారు. నాకు రెండెకరాలభూమి ఉంది. అది అమ్మి వాళ్లకి అయిదువందలూ ఇచ్చేశాను. లాటరీ ప్రతిఫలం రేపో మాపో రావాలి. పోటీకుంకలవల్ల ఆత్మగౌరవానికి భంగం వచ్చేటప్పుడు అష్టకష్టాలూ పడవలిసొస్తే పణ్ణాపడాలి, పడుతూనూ ఉన్నాం. అయినా సరే, పైపెచ్చుట, తప్పు మాదిట!!!


రాజమోహన హేరాయలు



శ్రేష్ఠమయిన సువాసనగల తలనూనె. మెదడుకు చల్లదనమును కలిగించి వెంట్రుకలను అభివృద్ధి చేయుటలో అత్యుత్తమ మయినది.

తలపోటు, కూడుపోటు, శిరో వేడిమి, చుండు మొదలగువాటిని పోగొట్టి కన్నులకు చలవ నొసంగి వెంట్రుకలను మృదువుపరచి, నల్లగా పెంచుటలో అత్యుత్తమ మయినది.

స్త్రీలకు ఆనందమును కలుగజేయును.

సీసా 1-కి రు. 0-12-0 6 సీసాలు రు. 4-4-0

పోస్టేజి ప్రత్యేకము.

వి. శి. ఏం. అండు కంపెని,

ఆయుర్వేదసమాజం,

పెరిదేపి, నెల్లూరుజిల్లా.

వేటూరి —
సుందరశాస్త్రిగారి

వర్ణ సుందరరసము

సర్వపవామేహములకుసంజీవి

గుణముప్రత్యక్షము
అనుభవసిద్ధము. ఇంజెక్షన్లు
అవసరంలేదు. ఎటువంటిసవా
మేహాలనైనా కుదుర్చును
౧౦ మారు ౫-

ఆర్యరసాయనశాల, ముక్త్యాల